సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం : 26 : జూన్ : 2024



సోమశిలలో 10.080 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 10.060 టీఎంసీలు ఉన్నాయి. 393 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.74,020
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,633
3 శాతం జీఎస్టీతో	రూ.6,832
నవర (8గ్రాములు)	రూ.54,656

గరిష్టం/కనిష్టం
36.2 /29.1

వాతావరణం

జిల్లాలో బుధవారం అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వాతావరణంలో తేమ 80 శాతం ఉంది.

న్యూస్‌రీల్

27న ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం

నెల్లూరు (సెంట్రల్): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నెల్లూరు ఆధ్వర్యంలో ఈ నెల 27న సమావేశం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అబితాబ్ శుక్లా, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి వల్లూరు సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోవూరు మండలంలోని గంగవరం ప్రాంతంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధికారులతో మంత్రి ఆనం సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న దేవదాయశాఖ మంత్రి ఆనం

నెల్లూరు (దర్గామిట్ట): దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సోమశిల ప్రాజెక్ట్, జిల్లా పంచాయతీ అధికారులతో పాటు పలు విభాగాల అధికారులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రజాసమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు జేసీ కలెక్టర్ సేతు మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

44,500 టన్నుల ఎరువుల నిల్వ

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వివిధ రకాల ఎరువులు 44,500 టన్నులు నిల్వ ఉన్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుభరోసా కేంద్రాల వద్ద 823 టన్నులు, సహకార సంఘాల వద్ద 2,247 టన్నులు, మార్క్‌ఫెడ్ బఫర్ 5,727 టన్నులు, ఇతర చోట్ల కలిపి 44,500 టన్నుల మేర నిల్వ ఉన్నట్లు వివరించారు. రైతులకు ఎరువులు కావాల్సి వస్తే మార్క్‌ఫెడ్ వద్ద కాని, రైతు భరోసా కేంద్రాల్లో కాని సంప్రదించాలని కోరారు.

1 నుంచి ఎన్సీఈఆర్టీ కార్యకలాపాలు



వీఆర్ కళాశాలలోని గదులను పరిశీలిస్తున్న ఎన్సీఈఆర్టీ బృందం

నెల్లూరు (టౌన్): ఎన్సీఈఆర్టీ కార్యకలాపాలను వచ్చే నెల 1వ తేదీ నుంచి వీఆర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎన్సీఈఆర్టీ హెచ్ఓడీ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన ఎన్సీఈఆర్టీ సభ్యులతో కలిసి వీఆర్ కళాశాలలో ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరిగగతిన పనులు పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'నేను బడికిపోతా'

- సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఉషారాణి



మాట్లాడుతున్న ఉషారాణి

సంగం: రాష్ట్ర ప్రభుత్వం బడిఈడు కలిగిన పిల్లలు బడిలో ఉండేలా 'నేను బడికిపోతా' కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. మంగళవారం సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులు, స్టూడెంట్ కిట్‌లను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులందరూ పాఠశాలల్లో ఉండేలా స్కూల్ కాంప్లెక్స్, మండల, జిల్లా పరిధిలో టీమ్‌లను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు పనుల ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్దుబాటు.. ఎందుకు లేటు

ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యపు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యాశాఖ పర్యవేక్షణాధికారులను బదిలీ చేయడంలో చూపించిన శ్రద్ధ, విద్యాబోధనపై చూపించకపోవడం ఈ రంగంపై ప్రాధాన్యత ఎంతో అర్థమవుతోంది. ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత విద్యా ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సబ్జెక్ట్ టీచర్లతో బోధనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలకు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలను అందులో విలీనం చేసింది. ఈ మేరకు వివిధ పాఠశాలల్లో సర్ప్లస్‌గా ఉన్న సబ్జెక్ట్ టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేసింది. అయితే తాజాగా విద్యా సంవత్సరం ప్రారంభమైనా సబ్జెక్ట్ టీచర్లను సర్దుబాటు చేయడంలో అలవికాని జాప్యం చేస్తోంది.





కేఎన్నార్ మున్సిపల్ స్కూల్

- గత విద్యాసంవత్సరంలో 362 స్కూళ్లలో 558 మంది టీచర్ల సర్దుబాటు
- ఉపాధ్యాయులు ఉన్న చోట పిల్లలు తక్కువ
- పిల్లలు లేని చోట ఉపాధ్యాయులు అధికం
- వచ్చే నెలలో ఫార్మేటివ్ పరీక్ష–1

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల సర్దుబాటు ప్రక్రియ గత ప్రభుత్వం ప్రాధాన్యతగా విద్యాశాఖాధికారులు స్కూళ్లు తెరుచుకోవడానికి ముందే చేపట్టారు. అయితే ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా.. ఈ ప్రక్రియ చేపట్టకపోవడం చూస్తే.. ఇది ప్రభుత్వ ప్రాధాన్యత కాని అంశంగా మారినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఆది నుంచి వ్యతిరేకిస్తున్న టీడీపీ.. తాజాగా అధికారంలోకి రావడంతో అదే ప్రాధాన్యతను కొనసాగిస్తున్నట్లు జరుగుతున్న పరిణామాలను బట్టి స్పష్టమవుతోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత పట్టి పీడిస్తోంది. సబ్జెక్ట్ టీచర్లు అందుబాటులో ఉన్నప్పటికీ సర్దుబాటు ప్రక్రియతో సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

జిల్లాలో 2,624 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో మొత్తం 2,624 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 2,029 ప్రాథమిక, 245 ప్రాథమికోన్నత, 340 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 1.98 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులు లేరు. ప్రధానంగా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉంది. గత విద్యా సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 362 పాఠశాలల్లో మొత్తం 558 మంది ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేసింది. వీరిలో ఎస్ఏ తెలుగు–56 మంది, ఎస్ఏ ఇంగ్లిష్ 10 మంది, ఎస్ఏ మ్యాథ్స్ 11 మంది, ఎస్ఏ ఫిజికల్ సైన్స్ 82 మంది, ఎస్ఏ బయాలజికల్ సైన్స్ 55 మంది, ఎస్ఏ హిందీ 37 మంది, ఎస్ఏ సోషల్ స్టడీస్ 49 మంది, ఎస్ఏ ఉర్దూ–2, లాంగ్వేజ్ పండిట్ హిందీ–1, లాంగ్వేజ్ పండిట్ తెలుగు–1, లాంగ్వేజ్ పండిట్ ఉర్దూ–1, ఎస్జీటీ తెలుగు–233 మంది, ఎస్జీటీ ఉర్దూ–20 మంది సర్దుబాటు చేసిన వారిలో ఉన్నారు.

పడకేసిన బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఇంకా దృష్టి సారించలేదు. ఒక పక్క ప్రైవేట్ పాఠశాలల్లో బోధన స్పీడ్ అందుకుంది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం నత్తనడకన సాగుతోంది. జిల్లాలో విద్యార్థులు లేని చోట ఉపాధ్యాయులు అధికంగా ఉంటే.. పిల్లలు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో సరిపడా టీచర్లు లేని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం ఈ సమస్యను అధిగమించేందుకు జీఓ జారీ చేసి టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చేపట్టింది. అయితే తాజాగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ప్రక్రియపై ఇంత వరకు దృష్టి సారించలేదు. టీచర్ల సర్దుబాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మెగా డీఎస్సీ డిసెంబరులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుంది. అప్పటి వరకు పేద పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇంతేనా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు జూలై నెలలో ఫార్మేటివ్–1 పరీక్ష నిర్వహించనున్నట్లు అకడమిక్ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యా కానుకకు సంబంధించి వస్తువులు పూర్తి స్థాయిలో రాలేదని చెబుతున్నారు.

వచ్చే నెలలో ఎఫ్ఏ–1 పరీక్ష

రాష్ట్ర ప్రభుత్వం అకడమిక్ షెడ్యూల్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెలలో ఫార్మేటివ్–1 పరీక్ష నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తప్పని సరిగా ఈ పరీక్ష రాయాల్సి ఉంది. ఫార్మేటివ్ పరీక్షలకు సంబంధించిన మార్కులను సంవత్సరాంతంలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో కలపనున్నారు. దీంతో ఈ పరీక్షలకు ప్రాధాన్యత ఉంది. ఫార్మేటివ్–1 పరీక్షకు సిలబస్ ప్రకారం ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు పాఠాలను పూర్తి చేయాల్సి ఉంది. పిల్లలు ఎక్కువగా ఉండి ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేయలేని పరిస్థితి ఉంది. దీంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉండడంతో ప్రభుత్వ పాఠశాలలకు నిధులు, బోధన, ఉపాధ్యాయుల కొరతకు ఆటంకం ఉండదని అందరూ భావించారు. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది.

సర్దుబాటుకు జీఓ ఇంకా రాలేదు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఎలాంటి జీఓ రాలేదు. ప్రస్తుతం ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం జరుగుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై ఎంఈఓలకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై డిప్యూటీ డీఈఓలకు సమాచారం సేకరించాలని ఆదేశాలు ఇచ్చాం. సమాచారం సేకరణ త్వరలో పూర్తి చేస్తాం, ఉపాధ్యాయుల సర్దుబాటుపై జీఓ వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం.

– పీవీజే రామారావు, డీఈఓ

కనీస వేతనాలు అమలు చేయాలి

- డీఆర్‌ఓ లవన్న



జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ లవన్న

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఎన్ఎంఆర్, దినసరి ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో ప్రభుత్వ సంస్థల్లో ఎన్ఎంఆర్, దినసరి ఉద్యోగులకు కనీస వేతనాలు అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి లవన్న మాట్లాడుతూ జిల్లాలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు అమలు చేయడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. నైపుణ్యం లేని ఉద్యోగులకు రూ.560, అర్ధ నైపుణ్యం కలిగిన వారికి రూ.665, నైపుణ్యం కలిగిన వారికి రూ.794 , ఉన్నత స్థాయి నైపుణ్యం కలిగిన వారికి రూ.907 వేతనాలు ఇవ్వాలని కమిటీ నిర్ణయించడం జరిగిందన్నారు. కమిటీ నిర్ణయించిన వేతనాలు 2025 మార్చి వరకు అమల్లో ఉంటాయన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల్లో అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధావు, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒక రోజు పండుగుళ్ల పొగాకు వేలం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం ఒకరోజు పండుగుళ్ల పొగాకు అమ్మకాలకు నిర్ణయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ మంగళవారం తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

28 నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): డీఎడ్ 2002–24 బ్యాచ్ విద్యార్థులకు ఫైనల్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెల 28 నుంచి జూలై 3వ తేదీ వరకు సింగిల్ స్పెల్‌లో జరగనున్నట్లు డీఈఓ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నిర్దేశిత సమయానికి హాజరు కావాలన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్ఓ పెంచలయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు (అర్బన్): స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ పెంచలయ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీ, పీఎన్‌డీటీ (గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం) అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోతుందన్నారు. ఆడ పిల్లల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశానికి హాజరైన ఎన్జీఓ నాయకులు మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి చట్టాన్ని పక్కగా అమలు జరిగేలా చేయాలన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతాలక్ష్మి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేదరికం, అవగాహన లేకపోవడంతోనే ఎక్కువ సంతానం కలిగి ఉంటున్నారన్నారు. గర్భిణుల ఆరోగ్యంపై ఆయా కుటుంబాలు ప్రత్యేక శ్రద్ధ చూపేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ కిరణ్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, ఎన్జీఓ నాయకులు కుసుమకుమారి, శ్రీనివాసరావు, డెమో అధికారులు శ్రీనివాసరావు, కనకరత్నం పాల్గొన్నారు

విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- నెల్లూరు, తిరుపతి జేసీలు



డయేరియాతో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న నెల్లూరు, తిరుపతి జిల్లాల జేసీలు, వైద్యాధికారులు

నెల్లూరు (అర్బన్): డయేరియాతో చికిత్స పొందుతున్న తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరు ట్రైబల్ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని నెల్లూరు, తిరుపతి జేసీలు సేతు మాధవన్, ధ్యానచంద్ర జిల్లా వైద్యశాఖాధికారులను ఆదేశించారు. నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో డయేరియాతో 10 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెండు జిల్లాలకు చెందిన జాయింట్ కలెక్టర్లు మంగళవారం విద్యార్థులను పరామర్శించారు. వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేయడంతో పాటు కావాల్సిన మందులు అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యసేవలు అందించాలని పెద్దాస్పత్రి డాక్టర్లకు సూచించారు. జేసీలు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. ప్రభుత్వ పరంగా వారికి నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. వారి వెంట నెల్లూరు డీఎంహెచ్ఓ పెంచలయ్య, తిరుపతి డీఎంహెచ్ఓ శ్రీహరి, పెద్దాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు పొందేందుకు నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ ఫలితాలు మంగళవారం ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు డీఈఓ పీవీజే రామారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2 వేల మంది ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరుకాగా 200 మంది ఎంపికైనట్లు చెప్పారు. వీరిలో జనరల్ 66 మంది, బీసీఏ 11 మంది, బీసీబీ 12 మంది, బీసీడీ 11 మంది, బీసీఈ ఆరుగురు, ఎస్సీ 30 మంది, ఎస్టీ ఎనిమిది మంది చొప్పున 200 మంది వివిధ కేటగిరీల్లో ఎంపికయ్యారన్నారు. వీరందరు ఇంటర్ వరకు ఉపకార వేతనాలు అందుకోనున్నారు.

చెలరేగుతున్న మట్టి మాఫియా

- గొలగమూడిలో టీడీపీ నేతలు రేయింబవళ్లు అక్రమ తవ్వకాలు
- కన్నెత్తి చూడని అధికారులు



గొలగమూడిలోని పడమటి చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న మట్టి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన తెల్లారి నుంచి వెంకటాచలం మండలం మట్టి మాఫియా చెలరేగిపోతోంది. వెంకటాచలం మండలంలోని గొలగమూడి పడమటి చెరువు నుంచి వారం రోజులుగా టీడీపీ నేతలు రేయింబవళ్లు మట్టి అక్రమ తవ్వకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీస్, మైనింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులు అయితే చూసీచూడనట్లు పోతున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోకపోగా అక్రమార్కులకు అధికారులు వంత పాడుతున్నారు. గతంలోనూ టీడీపీ నేతలు మట్టి, గ్రావెల్ వంటి సహజ వనరులను విచ్చలవిడిగా దోచేశారు. చెరువులను అయితే గనులను తలపించే రీతిలో తవ్వేసి, ఎంతో మంది ప్రాణాలు పోవడానికి కారణమయ్యారు. ఆ సమయంలో టీడీపీ అధికారం కోల్పోవడంతో అక్కసు పెంచుకున్న ఆ పార్టీ నేతలు ఎవరైనా ఇంటి అవసరాలకు సొంతంగా మట్టి, గ్రావెల్ తీసుకెళ్తున్నా.. నానా యాగీ చేసి, పోలీసులకు ఫిర్యాదు చేసి పట్టించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ ఏడాది ఆరంభంలో టీడీపీ నేతలే మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలిస్తుంటే పోలీసులకు సమాచారమిచ్చి పట్టించారు. అయితే అది తమ పార్టీ నేతలదే అని తెలుసుకుని నాలుక్కరుచుకుని.. తమ వారిని వదిలిపెట్టాలంటూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో వీరంగం చేసిన ఉదంతం స్థానికులు ఇప్పటికీ మరిచిపోలేదు. అప్పుడు.. ఇప్పుడు మట్టి, గ్రావెల్ రవాణాతో సహజవనరులను దోచుకున్నారు. అధికారం కోసం ఆవురావురుమంటున్న టీడీపీ తమ్ముళ్లు.. కౌంటింగ్‌లో టీడీపీ గెలవడమే తరువాయి.. క్షణం కూడా వృథా చేయకుండా విచ్చలవిడిగా అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి రవాణా సాగిస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ శ్రేణులు సాగిస్తున్న అరాచకాలను చూస్తున్న అధికారులు సైతం ఈ సమయంలో వారిని అడ్డుకునేందుకు సాహసించలేకపోతున్నారు. మరో అడుగు ముందుకు వేసి తమవంతు సహకారం అందిస్తున్నారు. పక్కా ఆధారాలతో ఫిర్యాదులు చేసినా.. విచ్చలవిడిగా తవ్వుతున్నా.. అధికారులు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడంతో మట్టి తరలించే వారికి అడ్డే లేకుండా పోయిందని గ్రామస్తులు మండి పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సామాన్య ప్రజలు తమ ఇళ్ల వద్దకు మట్టి తరలించాలంటే అనుమతులు లేనిదే తరలించేదానికి వీలు లేదని చెప్పిన అధికారులు, ప్రస్తుతం జరుగుతున్న అక్రమ తవ్వకాల గురించి పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ప్రైవేట్ లేఅవుట్లకు మట్టి తరలిస్తున్నా.. ఎందుకు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని అక్రమ మట్టి తవ్వకాలను నిలిపి వేసేందుకు చర్యలు చేపట్టక పోతే మట్టి మాఫియాపై ఊళ్లకు ఊర్లు తరలించి ఉద్యమిస్తామని ఆ గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

వామ్మో.. టమోరా!

కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లోనే ధరలు మండిపోతున్నాయి. దీంతో రిటైల్ దుకాణాల్లో మరింత ప్రియంగా మారాయి. రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో టమోటా, ఉల్లి ధరలు తారెత్తిస్తున్నాయి.

- రూ.100 మార్క్ దాటుతున్న కిలో
- రోజురోజుకు పెరుగుతున్న ఉల్లి ధరలు



నెల్లూరు (సెంట్రల్): టమోటా ధరలు ఎప్పుడు ఎంత రేటు ఉంటాయో ప్రస్తుతం చెప్పలేని పరిస్థితి నెలకొంది. రెండు నెలల క్రితం రూ.100లకు 5 కేజీలు ఉన్న టామోటాలు.. ఆ తర్వాత 3 కేజీలు విక్రయించారు. ఈ నెల మొదట్లో టామోటా ధర రూ.90లకు చేరితే.. ప్రస్తుతం రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. ఎక్కువగా టమోటాలు మదనపల్లి, పలమనేరు, అనంతపురం ప్రాంతాల నుంచి నెల్లూరుకు వస్తుంటాయి. నిత్యం జిల్లాకు దాదాపుగా 50 టన్నులు వస్తుంటాయి. అయితే ప్రస్తుతం పెరిగిన ధరల దృష్ట్యా 35 టన్నులు మాత్రమే వస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మిగిలిన కూరగాయలు కూడా కిలో రూ.70 మార్క్ దాటుతుండడంతో ఆందోళన కలిగిస్తున్నాయి. ఉల్లిపాయలు కూడా రూ.100 దాటడం గమనార్హం. అయితే టమోటా, ఉల్లిపాయల ధరలు పెరిగినప్పుడు గతంలో ప్రభుత్వం తరఫున సబ్సిడీతో విక్రయాలు చేసింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి స్పందన కరువు

ప్రధానంగా టమోటా, ఉల్లిపాయల ధరలతో పాటు, ఇతర కూరగాయల ధరలు పెరిగిన సమయంలో ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి. గతంలో ఉన్న ప్రభుత్వం కూడా ఎప్పుడు వీటి ధరలు పెరిగినా వెంటనే సబ్సిడీతో ప్రజలకు అందించే ఏర్పాట్లను ఆయా ప్రాంతాల్లోని రైతు బజార్‌ల్లో చేపట్టింది.

ఏమి కొనాలన్నా అధిక ధరలు



ప్రస్తుత రోజుల్లో కూరగాయలు ఏమి కొనాలన్నా ఆకాశాన్నంటుతున్నాయి. కిలో రూ.70 నుంచి రూ.100 తక్కువగా లేవు. ప్రధానంగా టమోటాలు, ఉల్లిపాయల ధరలు ఎక్కువగా ఉన్నాయి. చికెన్, మటన్ పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ విధంగా ధరలు ఉండడంతో వాటి వైపు చూడాలన్నా భయంగా ఉంది.

– రెడ్డి శాంతి, గృహిణి, డీసీపల్లి

ప్రభుత్వ బడులపై టీడీపీ పెత్తనం

కలిగిరి మండలంలోని పాఠశాలలో ఓ మహిళ మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకురాలిగా ఉంది. ఎన్నికల ఫలితాలు వచ్చాక టీడీపీ నాయకులు ఆ బడి ప్రధానోపాధ్యాయుడిపై ఒత్తిడి తెచ్చి ఆమెను విధుల నుంచి తప్పుకొనేలా చేశారు. కొండాపురం మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో కూడా ఇలాగే జరిగింది. జిల్లాలోని కొన్నిచోట్ల ఇదే పరిస్థితి ఉంది.

- తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి టీడీపీ కార్యకర్తల యత్నం
- మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు, ఆయాలను తొలగించాలని ఒత్తిళ్లు
- నేతలకు వత్తాసు పలుకుతున్న విద్యాశాఖ అధికారులు
- పేరెంట్స్ కమిటీ హక్కులకు మంగళం



దుత్తలూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాల

ఉదయగిరి: టీడీపీ నాయకులు అధికార దుర్వినియోగానికి తెగబడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. తాము చెప్పినట్లు చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారు. పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నియమించబడిన మధ్యాహ్న భోజన పథకం వారిని, పారిశుద్ధ్య కార్మికులను ఏకపక్షంగా తొలగించాలని బెదిరిస్తున్నారు. వారి స్థానాల్లో తమకు కావాల్సిన పార్టీ కార్యకర్తలను నియమించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా మౌనం పాటిస్తున్నారు. ఈ పరిణామాలు భవిష్యత్‌లో బడులపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వారికే హక్కు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,624 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో 2,029 ప్రాథమిక, 245 ప్రాథమికోన్నత, 340 ఉన్నత పాఠశాలలున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల నిర్వహణపై పూర్తి హక్కులు పేరెంట్స్ కమిటీలకు ఉంటాయి. అవి నెలకొకసారి సమావేశమై ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై పరిశీలన జరిపి సూచనలు, సలహాలు ఇస్తుంటాయి. అవసరమైతే ఈ కమిటీల సిఫార్సుల ఆధారంగా భోజన పథకం నిర్వాహకులు, పారిశుద్ధ్య కార్మికురాలిని తొలిగించి, వారి స్థానంలో కొత్తవారిని నియమించుకోవచ్చు. ఈ అధికారం ప్రభుత్వానికి, విద్యాశాఖ అధికారులకు ఉండదు. ఒక్క పేరెంట్స్ కమిటీలకు మాత్రమే ఉంది. 2019 సెప్టెంబర్ 23వ తేదీన అప్పటి ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించింది. కమిటీల సూచన మేరకు రాజకీయ పార్టీలకు అతీతంగా భోజన తయారీదారులు, ఆయాలను నియమించారు. అయితే విద్యాహక్కు చట్టం, పేరెంట్స్ కమిటీలను లెక్కచేయకుండా టీడీపీ నాయకులు సర్కార్ బడులపై పెత్తనం చెలాయిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతిస్తున్నారు.

జూలై వరకు పాత కమిటీలే..

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చివరిసారిగా 2021 సెప్టెంబర్ 22న పేరెంట్స్ కమిటీల ఎన్నికలు జరిగాయి. ప్రతి బడిలో చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు 13 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీటి కాల పరిమితి 2023 సెప్టెంబర్ 21వ తేదీతో గడువు ముగియగా అప్పటి ప్రభుత్వం 2024 జూలై వరకు పెంచింది. 2024–25 విద్యా సంవత్సరానికి కొత్త కమిటీలను ఎన్నుకొనే వరకు పాత కమిటీలకే అధికారాలు ఉంటాయి. కానీ టీడీపీ నేతలు అప్పటి వరకు ఆగకుండా ఇష్టారాజ్యంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఆయాల తొలగింపు, నియామకాలకు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ ప్రస్తుత పేరెంట్ కమిటీలు తమకు అనుకూలం కాదని నూతన ప్రభుత్వం భావిస్తే, కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి కొత్త వాటిని ఎన్నుకున్న తర్వాత మార్పులు చేస్తే బాగుంటుందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నడూ లేని విధంగా..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలపై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు టీడీపీ నాయకులు కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యకర్తలను స్కూళ్లలో ఆయాలుగా, భోజన పథకం నిర్వాహకులుగా నియమిస్తుండడంతో ఉపాధ్యాయుల మాట ఏ మేరకు వింటారో అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీరు విధులు కూడా సక్రమంగా నిర్వహించే అవకాశం లేదు. పార్టీ కార్యకర్తలు, నేతలు కావడంతో ఉపాధ్యాయులు కూడా నోరు మెదిపే పరిస్థితి లేదు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు


గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- వైభవంగా వెంగమాంబ గ్రామోత్సవం

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం గ్రామోత్సవం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వెంగమాంబ – గురవయ్య దంపతుల ఉత్సమూర్తులను ఊరేగింపు చేశారు. సంతానం లేని మహిళలు అమ్మవారి ముందు వరపడ్డారు. ఆలయం నుంచి గ్రామోత్సవం కనులపండువగా ప్రారంభమై నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవవారిపాళెం మీదుగా సాగింది. అంతకుముందు నర్రవాడలో ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం నిర్వహించారు. వెంగమాంబ దంపతులకు పులివర్తి వంశీయులు మేళతాళాల నడుమ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవానికి తీసుకెళ్లారు.

నేడు ప్రధాన ఘట్టాలు

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రధాన ఘట్టాలను నిర్వహిస్తారు. ఉదయం వడ్డిపాళెం నుంచి నర్రవాడ వరకు పసుపు కుంకుమ ఉత్సవం, అనంతరం వెంగమాంబ – గురవయ్య దంపతుల కల్యాణోత్సవం, రాత్రి ప్రధాన ఉత్సవం జరుగుతుంది. భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు ఉదయగిరి సీఐ గిరిబాబు తెలిపారు. ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, ఎస్సై, ఏఎస్సైలు 15 మంది, హెడ్‌కానిస్టేబుళ్లు 56 మంది, కానిస్టేబుళ్లు 97 మంది, హోంగార్డులు 83 మంది, 30 మంది స్పెషల్, ఏఆర్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న పులివర్తి వంశీయులు


ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

జాగ్రత్త పడకపోతే సొమ్ము కొట్టేస్తారు

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే నగదు కాజేత
- అప్రమత్తంగా ఉండాలన్న పోలీసు అధికారులు
- ఎంఆధార్ యాప్‌తో ఉపయోగం



నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. వేలిముద్రలను ఆధారంగా చేసుకుని బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మును ఖాతాదారుని ప్రమేయం లేకుండానే ఇట్టే దోచేస్తున్నారు. పెద్ద మొత్తంలో నగదు దోచేస్తే పట్టుకుంటారన్న ఆలోచనలతో రూ.10 వేలలోపు ఉండే చిన్న చిన్న మొత్తాలను కాజేస్తున్నారు. బాధితులు ఈ మోసాన్ని గుర్తించి బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసినా పెద్దగా స్పందన లేకపోవడం, పోలీసుస్టేషన్‌కు ఏం వెళ్తామని అనుకోవడంతో ఈ తరహా మోసాలు అధికమయ్యాయి. కష్టపడి సంపాదించి దాచుకున్న సొమ్ముకు భద్రత కరువవడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. గతేడాది నెల్లూరుకు చెందిన ఓ మహిళ తన ఖాతాల్లో నగదు మాయమైందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ తరహా మోసం తొలిసారిగా జిల్లాలో వెలుగులోకి వచ్చింది. అప్పట్లో పోలీసులు స్పందించి రోజుల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేశారు. ఇటీవల ఇలాంటి మోసాలు జరుగుతున్నాయి. ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ఏఈపీఎస్ ద్వారా..

డిజిటల్ ఇండియాలో భాగంగా బ్యాంకు సేవలను విస్తరించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుండడంతో కుగ్రామాల్లోని ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో బ్యాంకు ఖాతాలు తెరిచారు. అయితే చాలాచోట్ల పల్లెల్లో బ్యాంకులు ఎక్కువ దూరంగా ఉండడం, ఏటీఎంలు అందుబాటులో లేకపోవడంతో ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్)ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. పాస్‌బుక్, ఏటీఎం కార్డు లేకుండానే చేతి వేలిముద్రల ద్వారా రోజుకు రూ.10 వేలు మాత్రమే డ్రా చేసుకునే అవకాశం ఉంది.

ఏం చేస్తున్నారంటే..

సైబర్ నేరగాళ్లు ఐజీఆర్ఎస్ (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్) వెబ్‌సైట్ నుంచి ఆస్తి కొనుగోలుదారుల దస్తావేజులు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. అందులోని వేలిముద్రలు, ఆధార్ నంబర్‌ను సేకరిస్తున్నారు. ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం ద్వారా బాధితుడి ఆధార్‌నంబర్, వేలిముద్రలను స్కాన్‌చేసి నగదు స్వాహా చేస్తున్నారు. పలువురు నేరగాళ్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మరికొందరు సిమ్‌కార్డులు విక్రయించే వారి నుంచి ఆధార్, వేలిముద్రలు సేకరించి బ్యాంకు ఖాతాల్లోని నగదును దోచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఇలా చేస్తే..

ఎంఆధార్ యాప్‌తో భద్రత లభిస్తుంది. దీనిని ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని అందులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కుటుంబ సభ్యులందరి ఆధార్ వేలిముద్రలను లాక్ చేసుకోవాలి. ఒక్కసారి వేలిముద్రలను లాక్ చేస్తే ఎక్కడా ఓపెన్ కావు. మనం వేలిముద్రలు వేయాలన్నా లాక్‌ను అన్‌లాక్ చేయాల్సిందే. దీని ద్వారా నగదు కోల్పోయే అవకాశం ఉండదు.

వేలిముద్రలను లాక్ చేసుకోండి



సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏఈపీఎస్ విధానం ద్వారా నకిలీ వేలిముద్రలతో కొందరు బ్యాంకు ఖాతాల్లోని నగదు కాజేస్తున్నారు. ఈ తరహా మోసాలకు గురికాకుండా ఉండాలంటే ఎంఆధార్ యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ వేలిముద్రలు (బయోమెట్రిక్)ను లాక్ చేసుకోవాలి. అవసరమైనప్పుడు మాత్రమే అన్‌లాక్ చేసి పని పూర్తయిన వెంటనే లాక్‌చేయాలి. తద్వారా నగదు కోల్పోయే అవకాశం ఉండదు. ఇటీవల కాలంలో ఎక్కడైనా వేలిముద్రలు వేసిన సందర్భాలుంటే అక్కడికి వెళ్లి వేలిముద్రలను డీలింక్ చేసుకోవాలి. వ్యక్తిగత సమాచారాన్ని, వేలిముద్రను అనవసరంగా ఎవరికీ ఇవ్వరాదు. సైబర్ మోసాలకు గురైతే తక్షణమే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలి. లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. – డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

నూతన చట్టాలపై అవగాహన


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న నూతన చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ ఎస్పీలు సౌజన్య, ప్రసాద్ తెలిపారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాలతో నెల్లూరులోని పోలీస్ కార్యాలయం నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీలు, లీగల్ అడ్వైజర్లు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా చట్టాల్లో మార్పులు చేసిందన్నారు. వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. కేసుల దర్యాప్తు చట్ట పరిధిలో జరపాలన్నారు. కొత్త, పాత చట్టాలలో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా వివరించి, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, సైబర్ క్రైమ్ విభాగం సీఐ హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 140	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 280
లేయర్ (లైవ్)	: 120		
బ్రాయిలర్ చికెన్	: 250	లేయర్ చికెన్	: 204

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



నెల్లూరు సిటీ: ఓ వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. 65 నుంచి 70 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి ఈనెల 10వ తేదీన వేదాయపాళెం – వెంకటాచలం రైల్వే స్టేషన్ మధ్య కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి 108కి సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నెల్లూరు సిటీ: నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో సైన్స్ పార్క్ సమీపంలో ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నారు. ఈ విషయం దర్గామిట్ట సీఐ అల్తాఫ్ హుస్సేన్‌కు తెలియడంతో ఆయన ఆదేశాలతో సిబ్బంది మంగళవారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.35 వేలు స్వాధీనం చేసుకున్నారు. కూలి పనులు చేసుకునే వారిగా పోలీసులు గుర్తించారు.

గంగపట్నంలో హుండీ కానుకల లెక్కింపు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరిగాయి. హుండీలోని కానుకలను లెక్కించగా రూ.5,37,138 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండి శాంతయ్య మంగళవారం తెలిపారు. అన్నప్రసాద వితరణ హుండీలోని కానుకలను లెక్కించగా రూ.11,447, దేవస్థాన హుండీ ద్వారా రూ.3,66,941, దర్శన టికెట్ల ద్వారా రూ.1,07,710, కల్యాణ చదివింపుల ద్వారా రూ.51,040 వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులపై తెలుగుదేశం అక్కసు

- గత ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా పింఛన్లు
- అనర్హులున్నారంటూ అధికారులకు తెలుగు తమ్ముళ్ల ఫిర్యాదు
- నిరసన తెలిపిన లబ్ధిదారులు


డీడీతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

మనుబోలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందాయి. అయితే టీడీపీ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని లబ్ధిదారులపై అక్కసు ప్రదర్శిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మండలంలోని అక్కంపేట ఎస్సీ కాలనీకి చెందిన పలువురికి పింఛన్ల పంపిణీపై విచారణ చేసేందుకు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు మంగళవారం అక్కంపేట సచివాలయానికి చేరుకోగా లబ్ధిదారులు నిరసన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 45 మంది డప్పు కళాకారులు, చర్మకారులకు గత ప్రభుత్వంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన అక్కంపేట నాయకులు రామ్మోహన్‌రెడ్డి, అమీర్‌బాషా పింఛన్లు అందుకుంటున్న వారిలో 29 మంది అనర్హులున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వెంకటయ్య, ఏఎస్‌డబ్ల్యూఓ హజరత్తయ్య, డీఎల్‌డీఓ వసుమతి తదితరులు అక్కంపేట సచివాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు సచివాలయం వద్దకు చేరుకుని డీడీ ఎదుట నిరసన తెలిపారు. అప్పటి మంత్రి కాకాణి పార్టీలకు అతీతంగా పింఛన్లు ఇప్పించారన్నారు. విచారణ చేయాలనుకుంటే అందరిపై చేయాలన్నారు. ప్రత్యేకించి తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేసిన వారిపైనే విచారణ చేయడం ఏమిటంటూ అధికారులను నిలదీశారు. పింఛన్‌దారుల ఆవేదనతో అక్కడ గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. రికార్డులు పరిశీలించేందుకే వచ్చామని, అన్ని సక్రమంగా ఉన్నాయని, ఎవరి పింఛన్లు తొలగించబోవట్లేదని డీడీ చెప్పడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు.

ఆర్చరీలో జిల్లా క్రీడాకారుల సత్తా

- 11 పతకాలు కైవశం



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి 11 పతకాలను కైవశం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం ఆ క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి పావురాల వేణు మాట్లాడుతూ 14వ ఎన్‌టీపీసీ మినీ అండర్–15, అండర్–13 ఓపెన్, అండర్–10 ఓపెన్ చాంపియన్‌షిప్‌లో జిల్లా ఆర్చరీ క్రీడాకారులు పలు విభాగాల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారని తెలిపారు. అండర్–15 ఇండియన్ రౌండ్‌లో ఎ.లాస్య బ్రాంజ్ మెడల్, రికర్వ్ రౌండ్‌లో చాట్ల అక్షయ్ మహదేవ్ గోల్డ్ మెడల్ సాధించారన్నారు. అండర్–13 ఇండియన్ రౌండ్‌లో వై.దీత్యాచండిక, కె.మధుసూదన్‌లు 4వ స్థానంలో నిలిచారన్నారు. రికర్వ్ రౌండ్‌లో (ఓపెన్ విభాగం) చాట్ల అక్షయ్ మహదేవ్ గోల్డ్ మెడల్ సాధించగా, బి.అక్షయ్ రమణ 4వ స్థానంలో నిలిచాడన్నారు. అండర్–10 కాంపౌండ్ రౌండ్‌లో టీపీ గిర్వాణ్ సిల్వర్ మెడల్, కె.లలిత అచ్యుత్ శ్రీరామ్, పి.మేథాసింగ్ బ్రాంజ్ మెడల్ సాధించగా, కె.తన్విక్ రావత్, పి.అహానాశ్రీ 4వ స్థానం సాధించారన్నారు. వీరంతా జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. అలాగే స్టాండ్‌బైగా చాట్ల అశ్విన్‌కుమార్, టి.విశ్వితారెడ్డి, కె.లోహిత్ కుమార్ యాదవ్, బి.నూతన్, జి.చైతన్య, డి.నిష్విత‌లు ఎంపిక అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

30న స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కర్నూలులో వచ్చే నెల 13, 14 తేదీల్లో జరిగే 9వ రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్‌జూనియర్ బాలబాలికల స్విమ్మింగ్ పోటీల కోసం జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మధు, కె.సనత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 9 గంటలకు ఎంపికలను కోచ్ డి.నాగరాజు నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను అసోసియేషన్ కోశాధికారి ఎస్.శివశంకర్‌రెడ్డి వద్ద నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు నాగరాజును (ఫోన్ నంబర్ 88019 16198) సంప్రదించాలన్నారు. ఎంపికలు మూడు విభాగాల్లో జరుగుతాయన్నారు. 10 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులని, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) గుర్తింపుకార్డు కలిగి ఉండాలని తెలియజేశారు.